క్లుప్తంగా

కుష్టు బాధితులకు కంటి పరీక్షలు


మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని ఆమంచర్లలో సేవా జ్యోతి లెప్రసీ కాలనీలో కుష్టు బాధితులకు గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ మాట్లాడుతూ 42 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అందులో ముగ్గురికి చికిత్సల అవసరమని తెల్పినట్లు తెలిపారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన సీఎం, ఎస్సైలు న్యాయవాది బెతాళ ప్రకాశరావు పట్ల అమానుష ప్రవర్తనకు నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్య యాదవ్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించి కోర్టు విధులను బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించామని వారు తెలిపారు.

ట్రావెల్స్ యజమానులతో సమావేశం

నెల్లూరు (టౌన్): స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యజమానులతో డీటీసీ చందర్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండగకు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోగొండు నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలోని హైవేపై మూడు బృందాలతో తనిఖీలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్టీఓ నిరంజన్, ఎంవీఐ బాలమురళి, రవీ, ఏఎంవీఐ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



నెల్లూరు (పొగతోట): రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సన్మానించారు. జెడ్పీ కార్యాలయంలో విద్యార్థులు శ్రీకీర్తి, రాజశ్రీలను గురువారం ఆమె సత్కరించారు. అనంతరం విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ, ఉపాధ్యాయిని కామాక్షమ్మలను అభినందించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, డిప్యూటీ సీఈఓ మోహనరావు, డీఈఓ బాలాజీరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం మినీ బైపాస్ రోడ్డు వద్ద హజరత్ సయ్యద్ దర్గాలో గంధ మహోత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

వైకుంఠ ఏకాదశికి

విస్తృత ఏర్పాట్లు

- తిరుపతి ఘటనతో దేవదాయశాఖ అప్రమత్తం
- ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు

నెల్లూరు(బృందావనం): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని (ముక్కోటి ఏకాదశి) పురస్కరించుకుని రంగనాయకులపేటలోని రంగనాథస్వామి దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రంగని దర్శనం కోసం భారీ ఎత్తున వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా దేవదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి గురువారం నుంచే పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల కోసం ఉచిత, రూ.50, రూ.200 టికెట్లతో స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే క్యూలైన్‌లను క్షాత్ వందనతో నిర్మించామన్నారు. తిరుపతి ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.


ఆలయం లోపల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


విద్యుద్దీపాలంకరణలో రంగనాథస్వామి ఆలయం



దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని దేవాలయాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ గురువారం దిశానిర్దేశం చేశారు. దేవాలయాలు, పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనే దేవాలయాల వద్ద బారికేడ్లు, క్యూ పద్ధతి పాటించేలా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మఫ్టీలో సిబ్బందిని ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. క్యూలైన్ల వద్ద తోపులాటలు జరగకుండా చూడాలన్నారు.

ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తా


మాట్లాడుతున్న క్రీడాకారిణి భవాని

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తగిన ప్రోత్సాహం అందిస్తే అంతర్జాతీయ పారా అథ్లెటిక్ పోటీల్లో మరిన్ని పతకాలు సాధిస్తానని పారా అథ్లెటిక్ అంతర్జాతీయ క్రీడాకారిణి భవాని అన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ పారా అథ్లెటిక్ పోటీల్లో భారతదేశం తరఫున 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో రజత పతకాలను సాధించానన్నారు. తన ప్రతిభను గుర్తించి శాప్ చైర్మన్ రవినాయుడు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి తనకు రూ.లక్ష నగదు ప్రోత్సాహాన్ని అందజేయడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్‌తో పాటు కోచ్ జనీమకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పారా క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రి నాయుడు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.గురుప్రసాద్, పారా క్రీడా అసోసియేషన్ నిర్వాహకుడు కటారి యాదగిరి, డీఎస్‌డీ సూపరింటెండెంట్ విజయకుమార్ పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో యువజనోత్సవం

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీఎస్‌యూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు మాట్లాడుతూ స్వయం కృషి, పట్టుదల ఉంటే ఉన్నతమైన వ్యక్తులుగా ఎదుగుతారన్నారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులు, చెస్ట్ ఫిజీషియన్ రవి, స్వామి హృదయానంద, నెహ్రూ యువ కేంద్రం అధికారి మహేంద్రరెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం నిర్వహించారు. స్థానిక కిలారి తిరుపతినాయుడు కల్యాణ మండపంలో భాస్కర శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శేషారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసులురెడ్డి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడు పాబోలు సత్యం మాట్లాడుతూ అసోసియేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ కార్యదర్శి డాక్టర్ కె.అంకిరెడ్డి, ఎస్.రాఘవేంద్రరెడ్డి, వై.రాఘవరెడ్డి, ఎలక్టెడ్ గవర్నర్ ఎస్.బలరామానాయుడు పాల్గొన్నారు.



అధికారులు పర్యవేక్షించాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లను ప్రతిరోజూ సంబంధిత నోడల్ అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక ఇందిరాభవన్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 46వ డివిజన్ మండపాలవీధి, కాపువీధి, గద్దలవారివీధి, ట్రంకురోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నగరవ్యాప్తంగా రోడ్లపై ఉన్న గుంతలు, ప్యాచ్ వర్క్ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆదేవిధంగా నూతన నిర్మాణాలను గుర్తించడం, రోడ్డు ఆక్రమణల అంశంపై విధుల నక్రమంగా నిర్వహించని ప్లానింగ్ సెక్రటరీలకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి వితరణ



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆర్యన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సామగ్రిని పంపిణీ చేశారు. నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి హాజరై, నిరుపేదలకు అందించారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రామసత్యనారాయణ, సంఘ నాయకులు కొండా ప్రవీణ్‌శంకర్, శేగు షణ్ముఖరావు, కోట గురుబ్రహ్మం, సత్యనారాయణ, రమేష్, గాదంశెట్టి హేమంత్, అంజనేయులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ ఇవ్వాలి

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ‘తల్లికి వందనం’ డబ్బులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేరవేర్చాలన్నారు. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా విడుదల చేయాలన్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ ఆర్థిక సంవత్సరానికి బీసీ, కాపు, ఈబీసీ కులాలకు చెందిన వారు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ అధికారి నిర్మలాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కార్పొరేషన్ల కింద 50 శాతం సబ్సిడీపై ఈ రుణాలను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలియజేశారు. ఎంఎస్‌ఎంఈ బ్యాంక్ లింక్డ్ యూనిట్లకు రూ.25 లక్షల్లోపు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల బీసీ, ఈబీసీ, కాపు వర్గాలకు వారు తమ రేషన్ కార్డు, ఆధార్, ఆదాయ, కుల, జనన ధ్రువీకరణపత్రాలతో ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్లో నమోదు చేసుకోవాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆచారివీధిలో గురువారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఆచారివీధిలో సురేష్, దుర్గా(32) దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఏమైందో కానీ దుర్గా గురువారం తన ఇంట్లోనే ఉరివేసుకుంది. దీనిని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. అనారోగ్యంతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి అత్తింటివారు పోలీసులకు తెలియజేశారు. కాగా దుర్గా తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి నెల్లూరుకు బయలుదేరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


మున్సిపల్ స్కూల్లో..


కేబీఆర్‌లో..


నారాయణలో..

నెల్లూరు (టౌన్): నగరంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. స్థానిక కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత, కార్పొరేటర్ మహేష్‌బాబు, హెచ్‌ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

- స్థానిక బీవీనగర్‌లోని కేబీఆర్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక బాలాజీనగర్‌లోని సెలంద స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూల్ ఎండీ ముజాహర్, డైరెక్టర్ ఫహీం, హెచ్‌ఎం హేమలత పాల్గొన్నారు.
- స్థానిక నారాయణ స్కూల్లో విద్యార్థులు పలు వేషధారణల్లో అలరించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపల్ నరేంద్రరెడ్డి, ప్రిన్సిపల్స్ వెంగళరావు, సోని పాల్గొన్నారు.

పనిభద్రత కల్పించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గోపాలమిత్రలకు కూటమి ప్రభుత్వం పనిభద్రత కల్పించాలని గోపాలమిత్ర సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు దుగ్గిరాల అన్నపూర్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో గోపాలమిత్ర సంఘం మొదటి మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మందితో ఏర్పాటు చేసిన జిల్లా నూతన కమిటీలో అధ్యక్షులుగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, సహాయ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా యాసిన్ ఎన్నికయ్యారు.

స్నేహిత గ్రూప్స్‌ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా స్నేహిత గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఏపీ ఉమెన్ కమిషన్ మెంబర్ రుకాయ బేగం అన్నారు. నెల్లూరులోని మహిళా ప్రాంగణంలో శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో పది నుంచి 15 మంది కిశోర బాలికలతో గ్రూపులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంఈఓ మురళీధర్, తిరుపాల్, జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ తదితరులు మాట్లాడారు.

కాంగ్రెస్ నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి, బీజేపీ నేత అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రూరల్ పరిధిలోని కొత్తూరులో కాంగ్రెస్ నేతలు గురువారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి మల్లికార్జునరెడ్డి, పార్టీ మీడియా ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ అమిత్‌షాను వెంటనే క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పొర్లుకట్ట వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాగరాజును ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి తొమ్మిది క్వార్టర్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై డి.శ్రీధర్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించాలి

నెల్లూరు (టౌన్): భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించాలని డాక్టర్ ప్రేమ్‌చంద్ తెలిపారు. స్థానిక వైఎంసీఏ ప్రాంగణంలో బ్లూ బోర్ మిత్రమండలి, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో భోగి మంట పవిత్రహోమంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భోగి మంటల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, హెచ్‌ఏం తిరుమలరాజు, పీహెచ్‌పీ జిల్లా నాయకులు వేణుగోపాల్, మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, రాజశేఖర్, పెంచలయ్య, శివ, గౌస్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ సహకారశాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను జిల్లా సహకార శాఖ అధికారి(డీసీఓ) గుర్రప్ప గురువారం ఆవిష్కరించారు. నగరంలోని డీసీఓ కార్యాలయంలో దీనిని విడుదల చేశారు. అసోసియేషన్ జిల్లా నాయకులు మోహనకృష్ణ, కోటేశ్వరరావు, సిబ్బంది ఆర్.ఉమామహేశ్వరి, రసూల్‌ఖాన్ పాల్గొన్నారు.



మద్యం తాగొద్దని చెప్పినందుకే..

- వృద్ధుడి హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగొద్దని చెప్పినందుకు వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరులోని తూకుమాన్‌మిట్ట వద్ద పెన్నానది సమీపంలో ఎండీ ఉస్మాన్ రసూల్ (65) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఆయన గుప్పా పొర్లు దర్గాలో ఓ స్కూల్ వద్ద సైకిల్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 5న అర్ధరాత్రి రసూల్ తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారంగా నిందితులు ఈద్గామిట్ట గోపిటీ సెంటర్‌కు చెందిన షేక్.రఫీ, సల్మాన్‌లుగా గుర్తించారు. ఎస్పై బాలకృష్ణ గురువారం ఉప్పరపాళెంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. రఫీ బంగారు పనిచేస్తుండగా, సల్మాన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరు మద్యానికి బానిసయ్యారు. తరచూ రసూల్ ఇంటికి సమీపంలో ఉన్న మున్సిపల్ మరుగుదొడ్డి వద్ద మద్యం తాగేవారు. అక్కడ తాగొద్దని పలుమార్లు రసూల్ వారిని వారించాడు. ఈ క్రమంలో ఈనెల 5న రాత్రి మద్యం తాగుతుండగా రసూల్ అడ్డుకున్నాడు. కోపోద్రిక్తులైన వారు గొడవకు దిగారు. ఇంట్లోకి చొరబడిన నిందితులు గడ్డపార, వెదురుకర్రతో రసూల్‌ను హతమార్చి పరారయ్యారు. నిందితులను ఎస్పై అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు.

మంత్రి మెప్పు పొందేందుకే అడ్డగోలు విమర్శలు

మంత్రి నారాయణ మెప్పు పొందేందుకే ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై చేస్తు టీడీపీ నేతలు అడ్డగోలు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు వారు వేర్వేరు చోట్ల విలేకరుల సమావేశంలో టీడీపీ నేతల తీరును ఎండగట్టారు.

నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు

- వైఎస్సార్‌సీపీ నేత సిద్దిఖ్



నెల్లూరు(బృందావనం): ఆనం వెంకటరమణారెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్.సిద్దిఖ్ హితవు పలికారు. స్థానిక జెండావీధి కోటమిట్టలోని ఆయన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. ఆనం వెంకటరమణారెడ్డిని నెల్లూరు ప్రజలు ఎప్పుడో మరిచిపోయారన్నారు. తాగుబోతుల సంఘం అధ్యక్షుడిగా ఆనం వెంకటరమణారెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత అతనికి లేదన్నారు. ఇకనైనా కారుకూతలు మానుకోవాలని హితవు పలికారు.

దిగజారుడు వ్యాఖ్యలు తగవు

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జున

నెల్లూరు(బారకాసు): పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన అంశాన్ని కొందరు టీడీపీ నేతలు మంత్రి నారాయణ దృష్టిలో పడేందుకే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున అన్నారు. నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రెడ్‌క్రాస్‌పై టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డికి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఐదు నెలల కిందట 13వ డివిజన్‌లో ఇరిగేషన్ కాలువను ఆక్రమించి అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నారన్న విషయాన్ని ఆనం వెంకటరమణారెడ్డి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, మరి ఇప్పుడు ఏమి లబ్ధిపొంది మౌనంగా ఉన్నారో ప్రజలకు చెప్పాలన్నారు.



కష్టకాలంలో నారాయణ ఎక్కడికెళ్లారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జయకృష్ణారెడ్డి



నెల్లూరు(బారకాసు): టీడీపీ నేత తిరుమలనాయుడు రాజకీయ పబ్బం గడుపుకునేందుకే ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిగ జయకృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రస్తుత మంత్రి నారాయణ ప్రజల మధ్య కనిపించకుండా పారిపోయారని, అదే తమ నేత పర్వతరెడ్డి కష్ట సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండి రెడ్‌క్రాస్ ద్వారా ఎన్నో సేవలందించారని గుర్తుచేశారు. రెడ్‌క్రాస్‌పై తిరిగి తిరుమలనాయుడు నేడు ఇప్పుడా కారులో తిరిగే స్థాయికి ఎలా వచ్చారో చెప్పాలని నిలదీశారు. గతంలో ఆయన భవన నిర్మాణ కార్మికులను మభ్యపెట్టి ఎంతెంత వసూలు చేశారో అందరికీ తెలుసన్నారు. దీనిపై టీడీపీ నేతలు కూడా ఆయన్ను దూరం పెట్టారన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డి విస్తృత సేవలు అందించారు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు మల్లి నిర్మల

నెల్లూరు(బారకాసు): ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు మల్లి నిర్మల ఖండించారు. కరోనా సమయంలో చంద్రశేఖర్‌రెడ్డి ఎంతో ఉన్నతమైన సేవలు చేసిన అంశాన్ని గుర్తుచేశారు. ఈ మేరకు ఆమె గురువారం సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. ఎంతో మంది పేదలకు ఆక్సిజన్ సిలిండర్లను సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ, అలాగే అందులోని అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే తమ నాయకుడు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి స్వచ్ఛందంగా చైర్మన్ పదవికి రాజీనామా చేశారన్నారు. అయితే చంద్రశేఖర్‌కు సంబంధించిన విషయంపై ఎలాంటి అవగాహన లేని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రెడ్‌క్రాస్‌కు సంబంధించి ఏమైనా ఉంటే మాట్లాడాలే తప్ప వ్యక్తి, ప్రవృత్తికి సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని కించపరచి మాట్లాడడం హేయమైన చర్య అని పేర్కొన్నారు.

